క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ రైతులకు సన్మానం



రైతులను సన్మానిస్తున్న దృశ్యం

సీతంపేట: మండలంలోని శంభాం పంచాయతీ పరిధిలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న రైతులను సర్పంచ్ తిరుపతిరావు ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నవధాన్యాల సాగు ప్రతి రైతు చేపట్టాలని, ప్రకృతిలో లభించిన ఆకులతో కషాయాలు తయారు చేసుకోవాలని సూచించారు. రైతులు నాటు ఆవులను పెంచుకుని వాటి పేడ, మూత్రాన్ని ఎరువుగా పంటలకు వేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.నరేష్, లక్ష్మయ్య, వీఏఏ గాయత్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో రస్తాకుంటుబాయి గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని కురుపాం తహసీల్దార్ రమణమ్మ మంగళవారం ప్రారంభించా రు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, స్థానిక సర్పంచ్ అరిక సునీత, మాజీ సర్పంచ్ పట్టిక మాసయ్య, పొడి పంచాయతీ మాజీ సర్పంచ్ రంగారావు, స్థానిక యువత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రావుపల్లిలో నేత్ర వైద్యశిబిరం



నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ శాంతి

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లిలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఆశయ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మంగళవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో రావుపల్లి, గరుగుబిల్లి, కొత్తూరు తదితర గ్రామాలకు చెందిన 54 మందికి ఆప్తాలమిక్ పి.శాంతి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 31మందికి శస్త్ర చికిత్స లు అవసరమని గుర్తించారు.వీరికి త్వరలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. శిబిరం సమన్వయకర్త వెంకటరమణ, వైద్యులు జి.వేణుగోపాల్, ఆశయ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు చుక్క జగన్, పల్లెం భార్గవ్, ఎం.సాయి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం



బాధితులకు నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

గరుగుబిల్లి: చినగుడబ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మూడు ఇళ్లు దగ్ధమయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న ఇండియన్ రెడ్ క్రాస్‌సొసైటీ జిల్లా చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు దుస్తులు, ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకులు, హైజనిక్ కిట్లను మంగళవారం అందజేశారు. అలాగే ఉల్లిభద్ర గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు నిత్యావసర సరుకులు , దుస్తులు,దుప్పట్లు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి బి.ఎన్.బి.రావు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఎం.తవిటినాయుడు, ఎం.వెంకటనాయుడు, వైస్.సర్పంచ్ టి.జగన్నాథరావు, ఎం.పార్థసారథి, డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ వై.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జగన్‌మోహన్ ఉదారత

చినగుడబ గ్రామంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు దుప్పట్లు, చీరలు, దుస్తులు, బియ్యం అందజేశారు. తన తండ్రి గౌరు నాయుడు వర్ధంతి సందర్భంగా అగ్నిప్రమాద బాధితులకు సహాయం చేసినట్లు చెప్పారు.



బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న డాక్టర్ జగన్‌మోహన్

తగ్గిన దిగుబడి.. పెరిగిన ధర

అమాంతం పడిపోయిన మామిడి ఉత్పత్తి
- వాతావరణం అనుకూలించకపోవడమే కారణం
- పార్వతీపురం మన్యం జిల్లాలో మామిడి సాగు విస్తీర్ణం: 4 వేల హెక్టార్లు
- గతేడాది పంట దిగుబడి: 39.5 వేల మెట్రిక్ టన్నులు
- ఈ ఏడాది దిగుబడి 9.5 మెట్రిక్ టన్నులు



వీరఘట్టం మార్కెట్‌లో లభ్యమవుతున్న బంగినపల్లి మామిడికాయలు

వీరఘట్టం: మామిడి రైతులకు దిగులు తప్పడం లేదు. ఈ ఏడాది దిగుబడులు గణనీయంగా తగ్గడంతో పాటు అకాల వర్షాలు, ఈదురుగాలులు మరింత నష్టాల ఊబిలోకి నెట్టాయి.కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితుల్లో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణ దిగుబడి కంటే ఈ ఏడాది 75 శాతం దిగుబడులు తగ్గాయి. దీంతో జిల్లాలోని 4 వేల హెక్టార్లలో మామిడితోటలు సాగు చేస్తున్న 2,500 మంది రైతులు డీలా పడ్డారు.రూ.కోట్ల పెట్టుబడి పెట్టి కౌలుకు తీసుకున్న మామిడి తోటల్లో పూతలేక కాపుకాయక దిగుబడులు పడిపోవడంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది మామిడి దిగుబడులు తగ్గిపోవడంతో మామిడి రైతులు రూ.కోట్లలో నష్టాల ఊబిలో కూరుకుపోయారు.

ఏటా వేల టన్నుల మామిడి పంట ఎగుమతి చేసేవారు. ఈసారి పంట తగ్గడంతో ప్రజలు మామిడి పండ్లు కొని తిందామన్నా దొరకని పరిస్థితి ఏర్పడింది.పంట దిగుబడి పడిపోవడంతో ధర అమాంతం నాలుగు రెట్లు పెరగడంతో మామిడి రైతులకు కొంత ఊరట లభించింది.

ఇదీ పరిస్థితి..

ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో వీచే చలిగాలులకు మామిడిపూత వస్తుంది. అయితే గతేడాది అక్టోబర్‌లో అకాలు వర్షాలు పడడంతో పాటు చలితీవ్రత తగ్గింది. వాస్తవానికి నవంబర్, డిసెంబర్ నెలల్లో పగటి ఉష్ణోగ్రతలు 16 డిగ్రీల నుంచి 17 డిగ్రీలు ఉండాలి.అయితే వర్షాల ప్రభావంతో వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఆ రెండు నెలల్లో ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల నుంచి 30 డిగ్రీలు నమోదయ్యాయి. అంతేకాకుండా తెల్లవారు జామున కురిసిన తేనె మంచు తదితర కారణాల వల్ల మామిడిపూత తొలిదశలోనే రాలిపోయింది. దీంతో పంట దిగుబడులు కొంత తగ్గాయి. అలాగే మార్చి, ఏప్రిల్ నెలల్లో వచ్చిన ఈదురుగాలులు మామిడి పంటపై ప్రభావం చూపాయి. చివరిదశలో కోతకు వచ్చిన పంట పైన కూడా మే నెలలో వీచిన ఈదురుగాలులతో చాలా వరకు కాయలు రాలిపోయి రైతులు నష్టాలు చవిచూశారు.



వచ్చిన అరకొర బంగినపల్లిని ఎగుమతికి సిద్ధం చేస్తున్న రైతులు

ఇదీ విషయం..

వాస్తవానికి ఒకప్పుడు ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో అనుసంధానంగా ఉన్న పార్వతీపురం మన్యంజిల్లాలో 20 ఏళ్ల క్రితం ఉద్యానవన శాఖ ఆవిర్భవించింది. అయితే అంతకు ముందే దశాబ్దాల కాలం నుంచి ఉద్యానవన పంటలు సాగులో ఉన్నాయి. వాటిలో సీజనల్ పంట అయిన మామిడి తోటలు జిల్లాలో విస్తృతంగా ఉన్నాయి. గతంలో 3,500 హెక్టార్లలో మామిడి తోటలు ఉండేవి. గత 20 ఏళ్లుగా ఉద్యానవనశాఖ జిల్లాలో మరో 500 హెక్టార్లలో మామిడితోటల పెంపకానికి తోడ్పాటు అందించడంతో ప్రస్తుతం జిల్లాలో 4 వేల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం 25 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న మామిడి తోటలు 90 శాతం వరకు ఉన్నాయి. వర్షాల ప్రభావంతో వాటికి పూత రాక దిగుబడులు తగ్గినట్లు ఉద్యానవన శాఖ చెబుతోంది.

తగ్గిన దిగుబడి..

జిల్లాలో సాధారణంగా బంగినపల్లి, సువర్ణరేఖ, కలెక్టర్, దేశవాళీ రకాలు మామిడి పంట సాగులో ఉన్నాయి. దేశవాళీ రకాలు పీచు ఎక్కువగా ఉండి జూన్, జూలై వరకు వాటి దిగుబడి ఉంటుంది. ఇతర రకాలు మాత్రం మే–జూన్ మధ్యలోనే దిగుబడి వచ్చేస్తుంది.అయితే ఈ ఏడాది మే నెలాఖరుకు సీజన్ పూర్తయ్యేలా ఉందని రైతులు అంటున్నారు. జిల్లాలో 4 వేల హెక్టార్లలో మామిడి సాగు చేస్తున్నారు. ఏటా 39.5 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోంది.

డీలా పడిన వ్యాపారం..

జిల్లాలో ఏటా రూ.80 కోట్ల మామిడి పండ్ల వ్యాపారం జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా జిల్లా నుంచి ఎక్కువగా ఒడిశాలోని బరంపురం, ఖుర్దా, భువనేశ్వర్ నగరాలకు, అలాగే పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తాకు జిల్లా మామిడిని ఎగుమతి చేస్తుంటారు. అయితే ఈ ఏడాది దిగుబడులు తగ్గడంతో మామిడి ఎగుమతులు కూడా నిలిచిపోయి వ్యాపారాలు డీలా పడిపోయాయి.

వాతావరణ ప్రభావం

గతేడాది అక్టోబర్‌లో చలితీవ్రత తగ్గడం మామిడి పంటపై ప్రభావం పడింది. సీజన్‌లో సకాలంలో చలిగాలులు వీయకపోవడం, దీనికి తోడు పూత వచ్చిన సమయంలో తేనె మంచు కురవడం, అలాగే ఈదురు గాలులు వీయడం వంటి కారణాల వల్ల పూత రాక మామిడి దిగుబడులు తగ్గాయి. రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అప్పుడే దిగుబడులు పెరుగుతాయి.

టి.అమరేశ్వరి, ఉద్యానవనశాఖ అధికారి,పాలకొండ సర్కిల్



అరకొరగా పండిన దేశవాళీ మామిడి

స్థానిక మార్కెట్‌లో సిండికేట్ హవా..

ప్రస్తుతం బరంపురం మార్కెట్‌లో గ్రేడ్–1 రకం బంగినపల్లి కిలో రూ.40 ధర ఉంది.అయితే ఈ ధరకు ఎగుమతి చేసేందుకు తగినంత మామిడి దిగుమతులు లేవని రైతులంటున్నారు. ఉన్న అరకొర పంటను వ్యాపారులు స్థానికంగా ఉన్న మార్కెట్‌లోనే విక్రయిస్తూ సిండికేట్ అవుతున్నారు. ప్రస్తుతం పాలకొండ, వీరఘట్టం, పార్వతీపురం, సాలూరు తదితర ప్రాంతాల్లో బంగినపల్లి కిలో రూ.60 నుంచి రూ.80లు ఉంది. అలాగే చెరుకు రసాలు, దేశవాళీ రకాలు రూ.90 పలుకుతున్నాయి. అయితే ఈ ధరకు గ్రేడ్ రకం కొనుగోలు చేద్దామన్నా పంట దిగుబడి లేకపోవడంతో ఉన్న మేరకు జిల్లా ప్రజలు మామిడి పండ్లు కొనుగోలు చేస్తున్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి



అర్బన్ కాలనీలో నిర్మాణదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ

పాలకొండ రూరల్: గృహ లబ్ధిదారులు నిర్దేశిత సమయంలో వారికి కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ ఏఈ మాధవరావు కోరారు. ఈ మేరకు మండలంలోని లుంబ జారు సమీపంలో గల అర్బన్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల తాజా స్థితిగతులను క్షేత్రస్థాయిలో ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నిర్మాణదారులు, స్థలం లబ్ధిదారులతో మాట్లాడారు. దశలవారీగా బిల్లుల మంజూరుపై అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని పణుకువలస, డోలమడతోపాటు పలు పంచాయతీల్లో మంజూరైన ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా నిర్మాణాలు చేపడుతున్న వారిని కలిసి వారి పనులు వేగవంతం చేయాలని అవగాహన కల్పించారు. సమస్యలు ఉంటే తమ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు.

విధినిర్వహణలో అలసత్వం తగదు



కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ తదితరులు

పాలకొండ రూరల్: ప్రజలకు సేవలు అందించే క్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎం.విజయరంగారావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన తన కార్యాలయంలో సదరు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారికి అప్పగించిన పలు సర్వేల నమోదుకు సంబంధించిన తాజా స్థితిగతులపై పంచాయతీల వారీగా కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. వేసవి ముగిసి ఎపిడమిక్ సీజన్ ప్రారంభం కానున్న క్రమంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యభద్రత, అర్హత మేరకు వారికి అందించాల్సిన సంక్షేమం, క్షేత్రస్థాయిలో ప్రజా ఫిర్యాదులు అధికారుల దృష్టి తేవడంపై పలు సూచనలు చేశారు. గృహ నిర్మాణాలపై హౌసింగ్ అధికారులు సచివాలయ అడ్మిన్‌లతో సమీక్ష చేపట్టారు. ఈవోపీఆర్డీ కృష్ణారావు పారిశుధ్య నిర్వహణకు సంబంధించిన ప్రణాళికపై అవగాహన కల్పించారు.

ప్రమాదకర మలుపు



గోపాలపురం-మంగళాపురం గ్రామాల మధ్య ప్రమాదకర మలుపు

పాలకొండ రూరల్: మండలరిధి విశాఖ రహదారిలో గోపాలపురం– మంగళాపురం గ్రామాల మధ్య గల మలుపు ప్రమాదాలకు నెలవుగా మారుతోంది. ఈ రహదారి మీదుగా రాజాం, విజయనగరం వయా విశాఖకు నిత్యం వెళ్లే వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. సమీప మండలాల్లో గల కర్మాగారాలకు వెళ్లే వాహనాలతో పాటు అక్కడి సిబ్బంది నిత్యం ఇదే రహదారిలో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఈ భారీ మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల్లో రోడ్డుకు ఇరువైపులా చెట్లు. పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో సమస్య మరింత జటిలమవుతోంది. వర్షాలు కురుస్తుండడంతో మరెన్ని ప్రమాఇదాలు సంభవించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ తరుణంలో అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

షెడ్డుకు చేరుతున్న హార్వెస్టర్లు

భామిని: మండలంలో దాదాపు రబీ వరికోతలు పూర్తి కావచ్చాయి. దీంతో మంగళవారం మండలంలోని బిల్లుమడ మెకానిక్ షెడ్‌కు వరి కోతలు, నూర్పులు చేసే హార్వెస్టర్లు చేరుతున్నాయి. వాటికి చిన్నచిన్న మరమ్మతులు చేసి మరో వరికోతలకు సిద్ధం చేయడానికి హార్వెస్టర్‌లను షెడ్‌లకు చేర్చుతున్నారు.

మద్యం దుకాణాల పరిశీలన

బలిజిపేట: మండలంలోని మద్యం దుకాణాలను సీతానగరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి మంగళవారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మద్యం దుకాణాల్లోని రికార్డులు, స్టాకును ఆమె పరిశీలించారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని, బెల్టుషాపులను ప్రోత్సహించరాదని సూచించారు. షాపుల్లో ఎక్కడా ఎటువంటి తేడాలు లేవన్నారు. ఎక్కడైనా తేడాలు ఉంటే షాపు యజమానులపై చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిరోధించాలి

- ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

బలిజిపేట: బాల్య వివాహాలను నిరోధించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కనకదుర్గ తెలిపారు. కిశోరీ వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆమె మిర్తివలస కేంద్రాన్ని మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించాలని కోరారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అదేవిధంగా లింగవివక్ష చూపరాదని హితవు పలికారు. బాలికల అపహరణ, అక్రమ రవాణా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆహారలోపం, అనారోగ్యం, బాల్య వివాహాలు, లైంగికవేధింపులు, అక్రమ రవాణాను సమూలంగా అరికట్టడంలో అందరి పాత్ర ఎంతో అవసరమని పిలుపునిచ్చారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

- సీఐటీయూ డిమాండ్



ర్యాలీ చేస్తున్న పలు కార్మిక సంఘాల నాయకులు

పాలకొండ: కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ పాలకొండ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్త సమ్మె జూలై 9కి వాయిదా పడిన నేపథ్యంలో కార్మిక, కర్షక సంఘాలు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్నాయని తెలిపారు. కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువస్తున్నారని, ఈ లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికులు తమ సమస్యలపై నిరసన తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను బానిసలుగా మార్చే ఈ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారం నిర్వహించి కోటదుర్గమ్మ ఆలయం వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎ.కాంతారావు, పలు సంఘాల నాయకులు బి.అమరవేణి, బి.పార్వతి, ఎ.దర్శమ్మ, ఆర్.భవాని, కె.గౌరీశ్వరి, శారద, జాగా గోవిందరావు, మజ్జి వీరన్నాయుడు, దూసి దుర్గారావు, ఖండాపు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వార్డులో సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతి అందిస్తున్న కాలనీ వాసులు

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని 7వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలోమంగళవారం నగరపంచాయతీ కార్యాలయం ముందు కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ వార్డు పరిధిలోని నాలుగవ వీధిలో పబ్లిక్ కుళాయి ద్వారా తాగునీరు అందడం లేదన్నారు. కాలువలు పూడికలతో నిండిపోయి దోమలకు అవాసాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీధి దీపాలు సక్రమంగా పనిచేయడం లేదని, చెట్లు పెరిగిపోయి వాటి కొమ్మల్లో పాములు నివాసం ఉంటున్నాయని, ఈ సమస్యలపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ కమిషనర్ రత్నంరాజుకు వినతిపత్రం అందించారు.

పాఠశాలను పట్టించుకోని కమిటీ చైర్మన్

భామిని: మండలంలోని బాలేరు ఎంపీపీ(ఆర్)స్కూల్‌లో ఈదురు గాలులకు పాఠశాల ప్రాంగణంలోని చెట్టుకూలింది. కానీ ఆ చెట్టును ఇంకా తొలగించలేదు. ఇదే స్కూల్‌కు ఇప్పటికే రూ.5400 విద్యుత్తు బిల్లు వచ్చింది. ఆరు నెలలుగా మోటార్ మరమ్మతుల బారిన పడి మూలకు చేరింది. స్కూల్ చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయింది. ఈ విషయాలను స్కూల్ కమిటీ చైర్మన్ పట్టించుకోవడం లేదని..పాఠశాల హెచ్ఎం, కమిటీ కన్వీనర్ కమిటీ సభ్యులకు ఇదే విషయాన్ని తెలియజేశారు. కనీసం కమిటీ దగ్గర ఉన్న నిధులను ఖర్చు చేసేలా చూడాలని సభ్యులకు హెచ్ఎం లేఖ రాయడం విడ్డూరం. విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

దోమల దండయాత్ర



పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం వద్ద పరిస్థితి ఇలా

- పట్టించుకోని పాలకులు, అధికారులు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు

పాలకొండ రూరల్: గిరిజన ఆవాసాలు కలబోసి ఉన్న పాలకొండ పరిధిలో ప్రజలపై దోమలు దండయాత్ర ప్రారంభించాయి. ఎక్కడికక్కడే పారిశుధ్య లోపం పేరుకుపోవడం, అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ఆ వ్యర్థాలు కుళ్లి దోమల వృద్ధికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేస్తూ రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దీంతో ప్రజల ఆరోగ్య స్థితిగతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంచాయతీలకు గడిచిన 11 నెలలుగా పైసా నిధులు విడుదల చేయలేదు. ఈ క్రమంలో గ్రామాల్లో సర్పంచులు గతంలో ఉన్న వనరులతో నెట్టుకొస్తున్నారు. క్షేత్రస్థాయిలో పాలకులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడంతో ఈ పరిస్థితి నెలకొందని పలువురు సర్పంచులు వాపోతున్నారు.

చర్యలు ఏవీ?

కూటమి అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా సంక్షేమం, అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయడం లేదు. పంచాయతీల్లో సొమ్ము లేకపోవడంతో పారిశుధ్యం పడకేస్తోంది. గ్రామాల్లో దోమల నివారణకు ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు లేవు. 32 పంచాయతీలు, పట్టణంలోని 20 వార్డుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో మురుగు నీరు ప్రధాన రహదారి గోతులు, పల్లపు ప్రాంతాల్లో రోజుల తరబడి నిల్వ ఉంటున్న నీటి కుంటల్లో దోమలు పురుడు పోసుకుంటున్నాయి. పట్టణంలో డంపింగ్ యార్డు, జనాభాకు తగ్గట్లు పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో వీధి కూడళ్ల వద్ద రోజుల తరబడి చెత్త పేరకుపోతోంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో దోమలు పెరుగుతున్నాయి. దీనికి తోడు ఫాగింగ్ చేయకపోవడం, కాలువల్లో, వ్యర్థనీటి నిల్వల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా సంబంధిత మందులు పిచికారీ వంటి చర్యలు ఎక్కడా కానరావడం లేదు.



సిరికొండలో లోపించిన పారిశుధ్యంతో వృద్ధి చెందుతున్న దోమలు

ఆందోళన..

వేసవి ముగింపుతో పాటు నైరుతి రుతుపవనాలు త్వరలో విస్తరించనున్న క్రమంలో వర్షాలు ప్రారంభం కానున్నాయని అధికారులు చెబుతున్నారు. మరోవైపు మలేరియా, డెంగీ తదితర వ్యాధులు దోమల కారణంగా విజృంభించే అవకాశాలు అధికమని వైద్యులు గ్రామాల్లో ర్యాలీల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం వాటిని అధిగమించే చర్యలు కానరావడం లేదు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై అధికారుల వద్ద ప్రస్తావించగా పట్టణంలోని అన్నివార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టామని, రోజువారీ పారిశుధ్య పనులు చేయిస్తున్నామని నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజు అన్నారు. గ్రామాల్లో 22 సచివాలయ ద్వారా పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో వైద్యాధికారుల సూచనలతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.విజయరంగారావు తెలిపారు.

ఆర్థిక సంఘం నిధులు ఎక్కడ



గడిచిన 11 నెలలుగా ఎటువంటి నిధులు అందడం లేదు. గ్రామాల్లో చిన్న సమస్య తలెత్తినా సొంత సొమ్ము ఖర్చు చేసి పనులు చేయిస్తున్నాం. వాస్తవానికి 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమకావాల్సి ఉండగా అలా జరగలేదు. దీంతో పారిశుధ్యం, ఇతర అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి. రానున్న వర్షాకాలంలో గ్రామాల్లో అనేక సమస్యలు తలెత్తుతాయి. ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సంఘ నిధులు విడుదల చేస్తే కొంతమేరా సమస్యలు అధిగమించేలా వెసులుబాటు లభిస్తుంది.

టి.ఉపేంద్రకుమార్, మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు, పాలకొండ

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల అమ్మకాలు



డీఈఓ రమాదేవికి ఫిర్యాదు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గరుగుబిల్లి: జిల్లా కేంద్రానికి శివారు ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు అధిక రేట్లకు పుస్తకాలను అమ్ముతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరికృష్ణ ఆరోపించారు. సంబంధిత విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవితో కలిసి డీఈఓ రమాదేవికి మంగళవారం ఫిర్యాదు చేశారు. అలాగే అమ్మకానికి ఉంచిన పుస్తకాల గదిని పరిశీలించారు. ఏఎస్ఎఫ్ఐ నాయకులు వికాష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.